# రూ.80 కోట్ల స్థలాలు పేదలకు పంపిణీ

### 400 మంది సింగరేణి నిర్వాసితులకు ఇంటి పట్టాలు

### బీఆర్ఎస్ ప్రభుత్వానికి జైకొట్టిన లబ్ధిదారులు

భద్రాద్రి కొత్తగూడెం, (నమస్తే తెలంగాణ)/ కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 3 : లక్ష కాదు కోటి కాదు ఏకంగా రూ.80 కోట్ల విలువైన భూమిని సింగరేణి నిర్వాసితులు 400 మందికి పంపిణీ చేయడంతో లబ్ధిదారులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు జై కొట్టారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని గంగాహుస్సేన్‌బస్తీలో సింగరేణి ఓసీలో ఇండ్లు కోల్పోయిన వారికి స్థలాలు లాటరీ ద్వారా పట్టాలు పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

#### 20 ఏండ్ల నుంచి అద్దె ఇంట్లో ఉన్నాం



మా నాన్న దగ్గర నుంచి సింగరేణి ఏరియాలోనే ఉన్నాం. ఓసీలో ఇల్లు పోయింది. ఇక మాకు ఇల్లు రాదని అనుకున్నాం. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే వనమా నిజంగా దేవుడులా మాకు సాయం చేశారు. బీఆర్ఎస్ సర్కారు లేకపోతే మాకు ఇలాంటి సాయం అందేది కాదు. మాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. సీఎం సారు ఫొటో ఇంట్లో పెట్టుకుంటాము.

– గొలుసు భిక్షం దంపతులు, రుద్రంపూర్

#### వనమా సార్‌ను మర్చిపోలేను



మాలాంటి పేదలకు ఇలాంటి స్థలం వస్తదని ఊహించలేదు. లక్షలు పలికే భూమి నాలాంటి పేద కుటుంబానికి వచ్చింది. ఇంతకన్నా మాకు ఏంకావాలి. ఇప్పుడు కాదు ఎప్పటికీ కారు గుర్తుకే ఓటు వేస్తాను. మా కాలనీకి కేసీఆర్ నగర్ అని పేరు పెట్టుకుంటాము.

– ఆలకుంట పద్మ, వనమాకాలనీ, రుద్రంపూర్

#### ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఓపెన్‌కాస్టు విస్తరించడం వల్ల మా ఇల్లు పోయింది. చాలా బాధపడ్డాం. ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ బతుకుతున్నాను. ఇల్లు కట్టుకోవడం కాదు కిరాయి ఉండడం కూడా కష్టమే మాకు. అనేకమందిని కలిశాం. కానీ ఎమ్మెల్యే వనమా సీఎం కేసీఆర్ సార్‌తో మాట్లాడి ఎలాగైనా సమస్యను పరిష్కరించి ఇళ్ల స్థలం ఇస్తామని మాటిచ్చిండు. ఇప్పుడు అది నిజమైంది. చాలా సంతోషంగా ఉంది.

– జి.రమేశ్, నిర్వాసితుడు

#### వనమాకాలనీలో బతుకుతున్న



చాలా సంవత్సరాల నుంచి వనమా కాలనీలో బతుకుతున్న. ఇల్లు పోతదని ఎప్పుడు అనుకోలేదు. ఈ వయసులో ఏం పనిచేసి బతకాలి. ఎక్కడ బతకాలని రంధిపడ్డాను. కానీ సీఎం కేసీఆర్ మా పై దయ చూపిండు. ఎమ్మెల్యే మా బాధను విని ప్రభుత్వానికి చెప్పినంకా మాకు ఇల్లు కేటాయించేందుకు ప్రభుత్వం ఒప్పుకున్నదని చెప్పడంతో ప్రాణం నిమ్మలమైంది. ఇప్పుడు పట్టా కూడా ఇచ్చిండ్రు. ఇప్పుడు మాకు ఒక గూడు దొరికింది.

– తాటి పుల్లయ్య, నిర్వాసితుడు

#### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



ఇల్లు కూల్చేతరంటే బాధైంది. ఇక మా పరిస్థితి ఏంటని బాధపడ్డాం. స్థానిక నాయకులకు చెప్పి ఆందోళనలు కూడా చేశాం. కానీ మా బాధను ప్రభుత్వం విన్నది. ఇల్లు ఇస్తారని అధికారులు వచ్చి చెప్పారు. కానీ మా పేరు ఉంటదో ఉండదో అని భయపడ్డాం. అందరి ముందు డ్రా తీసి మాకు ఎమ్మెల్యే ఇంటి పట్టా ఇచ్చారు. కేసీఆర్ ఇచ్చే పెన్షన్ కూడా వస్తున్నది. సీఎంకు రుణపడి ఉంటాం.

– ఎం.సరస్వతి, నిర్వాసితురాలు

# ఓటర్లు ఓటుహక్కును పరిశీలించుకోవాలి

### జిల్లాలో మరో మూడు పోలింగ్ కేంద్రాలు

### జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : ప్రతి ఓటరు తన ఓటుహక్కును పరిశీలన చేసుకోవాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి అన్నారు. మంగళవారం ఐడీవోసీ మినీ సమావేశ మందిరంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేక ఓటరు సవరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 1,092 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో మూడు పోలింగ్ కేంద్రాలు భద్రాచలంలో 2, కొత్తగూడెంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. 1950 కంట్రోల్ రూమ్‌కు, ఎన్‌జీఆర్ఎస్ పోర్టల్‌కు ఓటరు నమోదు, ఎపిక్‌కార్డులు జారీ ప్రక్రియపై 155 ఫిర్యాదులు రాగా వాటన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. నూతన ఓటరు నమోదుకు 2016 నుంచి 2020 వరకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు చెప్పారు. ఐసీడీఎస్, ఇంటర్మీడియట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా లబ్ధి పొందిన జాబితాను లక్ష్యంగా చేసుకొని ఓటు నమోదుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో కొండకోనల్లో జీవిస్తున్న కొండరెడ్ల కుటుంబాలకు 692 మందికి కొత్తగా ఓటుహక్కు కల్పించడం పట్ల, అలాగే 18–19 సంవత్సరాల యువతీ యువకులు నూతనంగా ఓటుహక్కుకు నమోదు కావడం పట్ల తీసుకున్న చర్యలపై కలెక్టర్ ప్రియాంకను అభినందించారు. జిల్లాలో మొత్తం 9,45,094 మంది ఓటర్లున్నారని, వారిలో 4,61,315 మంది పురుషులు, 4,83,741 మంది మహిళలు, 38 మంది ట్రాన్స్‌జెండర్లు నమోదైనట్లు చెప్పారు. 14,130 మంది దివ్యాంగులు ఓటుహక్కు కలిగి ఉన్నట్లు చెప్పారు. ఆగస్టు 21న ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా తదుపరి వచ్చిన 68,703 అభ్యంతరాలను పరిష్కరించినట్లు ఆమె చెప్పారు. అనంతరం దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్డీవో మధుసూదన్ రాజు, డీఆర్వో రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్డీవో శిరీష, ప్రత్యేక ఉప కలెక్టర్ కాశయ్య, నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి

## పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు ఫంక్షన్‌హాళ్ల ప్రారంభం

పాల్వంచ రూరల్, అక్టోబర్ 3 : మండలంలో ప్రసిద్ధి గాంచిన పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన రెండు ఫంక్షన్‌హాళ్లను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు ఈ నెల 4వ తేదీ బుధవారం ప్రారంభిస్తారని ఆలయ కమిటీ ధర్మకర్త ఎస్వీఆర్కే ఆచార్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.7 కోట్లతో రెండు ఫంక్షన్‌హాళ్లను నిర్మించామని తెలిపారు. తక్కువ ధరలో ఈ ఫంక్షన్‌హాళ్లు భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. త్వరలో 35 కాటేజీలను నిర్మించనున్నట్లు తెలిపారు. అన్నదాన సత్రం, షెడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంగంగట్టు గ్రామంలో రూ.25 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లెల శ్రీరామ్మూర్తి, ధర్మకర్తలు వెంగళరావు, చింతా నాగరాజు, విజయ్, బండిచిన వెంకటేశ్వర్లు, రామారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీఆర్కే ఆచార్యులు

## ఉపాధ్యాయ బదిలీ షెడ్యూల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 3 : జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌జీటీ, తత్సమాన కేటగిరి (ప్రభుత్వ, లోకల్‌బాడీ) ఉపాధ్యాయులకు బదిలీ షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈవో మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్పౌజ్ పాయింట్స్ తొలగించుకునేందుకు, నమోదు చేసుకునేందుకు, హెచ్ఆర్ఎంఎస్‌లో డీఎస్సీ ర్యాంకు నమోదు చేసుకునేందుకు, సరిచేసుకునేందుకు మాత్రమే ఈ నెల 3, 4 తేదీల్లో డీఈవో కార్యాలయాల్లో ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందని, 5వ తేదీన బదిలీల తుది జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. 6, 7 తేదీల్లో ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుందని, 8వ తేదీన ఆప్షన్స్ ఎడిట్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

## ఏడు చెరువుల్లో లక్ష చేపపిల్లలు విడుదల



గుండెపుడి చెరువులో చేపపిల్లలను వదులుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జూలూరుపాడు, అక్టోబర్ 3 : మండలంలోని ఏడు చెరువుల్లో లక్ష చేపపిల్లలని జిల్లా మత్స్యశాఖ అధికారి బానోత్ వీరన్న, ఎంపీడీవో వెంకటేశ్వర్లు మంగళవారం పంపిణీ చేశారు. కాకర్ల, జూలూరుపాడు, గుండెపుడి, మాచినేనిపేట, పాపకొల్లు గ్రామ పంచాయతీల్లోని ఏడు చెరువుల్లో ముడు రకాల బొచ్చ, రవ్వ, బంగారుతీగె చేపపిల్లలని వదిలారు. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై చేపలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ భార్గవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మోదీ దిష్టిబొమ్మ దహనం



పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్షాల నాయకులు

జూలూరుపాడు, అక్టోబర్ 30 : మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతుల మరణానికి కారణమైన కేంద్రమంత్రి అజయ్‌మిశ్రాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని కోరుతూ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్(న్యూడెమొక్రసీ) నాయకులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 3 : తెలంగాణ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ తొమ్మిదో చాంపియన్‌షిప్ పోటీలు కరీంనగర్‌లో గత నెల 30, ఈ నెల 1వ తేదీన జరిగాయి. ఈ పోటీల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న మాలోత్ అఖిల్ 3 కిలోమీటర్ల పరుగుపందెంలో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. మిడ్ రిలేలో అఖిల్, మాలోత్ ప్రేమ్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారు. షాట్‌పుట్‌లో రియాజ్‌పాషా రెండో స్థానంలో నిలిచి కాంస్యపతకాన్ని సాధించాడు. వీరిని ప్రిన్సిపాల్ కత్తి రమేశ్, అధ్యాపకులు సముద్రాల శ్రీనివాస్, సిబ్బంది మంగళవారం అభినందించారు.

## ఇసుక నిల్వల పరిశీలన



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 3 : మండలంలోని ఇసుక నిల్వలున్న ప్రాంతాలను మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారుల పరిశీలించారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంతాలైన రంగాపురం, నాగారం, తోగ్గూడెంలోని ఇసుక నిల్వలను పరిశీలించి లభ్యత, భూగర్భ జల వివరాలను సేకరించారు. రంగాపురం సర్పంచ్ హరి, గిర్దావర్ హతియా, సర్వేయర్ నాగేశ్వరరావు, శాంతకుమారి పాల్గొన్నారు.